

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట రోడ్‌షోకు హాజరైన జనం, బీఆర్‌ఎస్ నాయకులు

# ఎన్నికల తర్వాత బీజేపీలోకి రేవంత్

## మోదీ లైన్‌లోనే సీఎం ఉన్నడు

**బీఆర్‌ఎస్‌కు 10, 12 సీట్లొస్తే దేశ రాజకీయాలను కేసీఆర్ శాసిస్తారు**
**చోటేభాయ్, బడేభాయ్‌తో బీఆర్‌ఎస్ పోరాటం • ఆరు గ్యారెంటీలన్నీ గారడీలే**
**కృష్ణా జలాల్లో అన్యాయంపై మాట్లాడరేం? • చమురు ధరలు తగ్గినా పెట్రోల్ దిగలే**
**నిర్మల్ సభలో రాహుల్ పచ్చి అబద్ధాలు • కాంగ్రెస్, బీజేపీ గంజాయి మొక్కలు**
**రాముడిపేరుతో ఓట్లడగడం తప్ప దేశానికి బీజేపీ చేసింది శూన్యం**
**కల్వకుర్తి, అచ్చంపేట, గద్వాల రోడ్‌షోల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/గద్వాల, మే 8 : 'ప్రధాని మోదీలైన్‌లోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నడు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆయన బీజేపీలో చేరడం ఖాయం' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోమారు స్పష్టం చేశారు. చోటేభాయ్ కాంగ్రెస్, బడేభాయ్ బీజేపీతో ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోరాడుతున్నదని, బీఆర్‌ఎస్‌కు 10-12 ఎంపీ సీట్లు వస్తే కేసీఆర్ దేశ రాజకీయాలను శాసిస్తారని చెప్పారు. బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతుగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేటలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ రోడ్ షోల్లో కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారెంటీలన్నీ గారడీలేలని, అబద్ధపు హామీలతో మోసం చేసిన ఆ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ పేగులు మెడలో వేసుకుంటా అంటూ ఉద్యమ నేతనుద్దేశించి సీఎం స్థాయిలో ఉన్న రేవంత్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని, మహిళలకు మహాలక్ష్మి పథకం కింద రూ.2,500 ఆర్థిక సాయం అందలేదని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు రూ.4 వేల పింఛన్ రావడం లేదని, సిగ్గులేకుండా రేవంత్‌రెడ్డి ఐదు గ్యారెంటీలు అమలు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉన్నదని ధ్వజమెత్తారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు, రేవంత్ సంక్షేమ పథకాల అమలు తేదీలు మార్చుతున్నారని, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి జలదీక్ష చేస్తే తప్ప రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తాగునీటి విషయంలో చొరవ చూపలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి


నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఆర్‌ఎస్‌పీ, గువ్వల బాలరాజు

వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో లక్షన్నర పెండ్లిళ్లు జరిగాయని, వారందరికీ రేవంత్ తులం బంగారం బాకీ ఉన్నాడని చెప్పారు. బీఆర్‌ఎస్ తులసీ వనమైతే, కాంగ్రెస్, బీజేపీలు ఈ వనంలో గంజాయి మొక్కల్లాంటివని, వాటిని పీకేయాల్సిన అవసరం ఈ ఎన్నికల్లో వచ్చిందని ప్రజలకు సూచించారు. నిర్మల్ సభలో రాహుల్‌గాంధీ మహిళల ఖాతాల్లో రూ.2500 జమ చేస్తున్నామని పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు.

***కృష్ణా జలాల్లో అన్యాయంపై నోరెందుకు మెదపరు?**

కృష్ణాబేసిన్‌లో మన వాటా తేల్చాలని పదేళ్లుగా అడుగుతున్నా కేంద్రం పట్టించుకోలేదని, కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా కాంగ్రెస్ ఎందుకు నోరు మెదపడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు రిజర్వాయర్లు నిర్మించిన ఘనత కేసీఆర్‌దేని గుర్తుచేశారు. 'క్రూడాయిల్ ధర తగ్గినా పెట్రోల్, డీజిల్ రేట్లను కేంద్రం ఎందుకు తగ్గించడం లేదు? మోదీ హయాంలో ప్రజలపై 34 శాతం సుంకం వేశారు.. ప్రజలు రూ.30 లక్షల కోట్ల పన్నులు చెల్లిస్తే రూ.14లక్షల కోట్లు అదానీ, అంబానీకి రుణమాఫీ చేసింది మోదీ ప్రభుత్వం కాదా? అని ప్రశ్నించారు. రామమందిరం పేరుతో ఓట్లడగడం తప్ప దేశానికి బీజేపీ చేసిందేమీ లేదని విమర్శించారు. మోదీ ఒక్కటే ఒక్క పని చేసిండని, పిల్లల మనసుల్లో హిందూ ముస్లిం వ్యతిరేకత తెచ్చిండని మండిపడ్డారు. రాములును ఎంపీగా గెలిపిస్తే బీజేపీలోకి ఎందుకు పోయిండో సమాధానం చెప్పాలని నిలదీశారు. నాగర్‌కర్నూల్ ఎంపీగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

***బీజేపీ వస్తే దళితుల మూతికి ముంత : ఆర్‌ఎస్పీ**

బీజేపీ దుర్మార్గమైన పార్టీ అని, ఆ పార్టీకి ఎవరూ ఓట్లు వేయొద్దని, కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే దళితుల మూతికి ముంత కట్టే రోజులు వస్తాయని బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఓట్ల కోసం అబద్ధపు హామీలిచ్చి వాటిని నెరవేర్చకుండా రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే తాను ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి మహనీయుల బాటలో నడిచేందుకు రాజకీయాల్లోకి వచ్చానని తెలిపారు. కర్ణాటకకు చెందిన ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వేలాది మంది మహిళలపై అత్యాచారం చేస్తే, అలాంటి వ్యక్తి తరపున ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారం చేయడం నీచంగా ఉందన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంతంలో దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి ప్రజల జీవితాల్లో సమూల మార్పులు తీసుకొచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, పార్లమెంట్ ఇన్‌చార్జి రంగినేని అభిలాష్‌రావు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే మైనార్టీల అభివృద్ధి

### మౌలాలీలో మైనార్టీల ఆత్మీయ సమావేశంలో కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 8(నమస్తే తెలంగాణ) : గడిచిన పదేళ్లలో మైనార్టీల అభివృద్ధికి రూ.22వేల కోట్లు ఖర్చు చేశామని, బీఆర్‌ఎస్‌తోనే వారి అభివృద్ధి సాధ్యమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజిగిరి బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి తరపున బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన, మౌలాలీలోని బంజారా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేశామని, అన్ని మతాలకు ప్రాధాన్యతనిచ్చామని గుర్తుచేశారు. మోదీ ప్రభుత్వం కల్లబొల్లి మాటలతో ప్రజల చెవుల్లో పూలు పెడుతూనే ఉందన్నారు. రూ.15 లక్షలు ఏమోగాని, జన్‌ధన్ ఖాతాల్లో రూపాయి కూడా వేయలేదని, రైతుల జీవితాల్లో ఏ మార్పు రాలేదని, పేదలకు ఇండ్ల నిర్మాణం, 20 కోట్ల మందికి ఉపాధి అన్న బీజేపీ ఇప్పటివరకు చేసిందేమి లేదన్నారు.

# మిత్తితో బదులు తీర్చుకుంటాం

- **రేవంత్ ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక**
- **చంచల్‌గూడ జైలులో క్రిశాంక్‌కు పరామర్శ**

సైదాబాద్/ మాదన్నపేట/నాంపల్లి కోర్టులు, మే 8 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారమదంతో చిల్లర రాజకీయాలు చేస్తున్నదని, తమకూ సమయం వస్తుందని, అప్పుడు మిత్తితో కలిపి బదులు తీర్చుకుంటామని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హెచ్చరించారు. చంచల్‌గూడ జైలులో ఉన్న బీఆర్‌ఎస్ సోషల్‌మీడియా కన్వీనర్ క్రిశాంక్‌ను బుధవారం ఆయన ములాఖత్ ద్వారా కలిసి పరామర్శించారు. అనంతరం జైలువద్ద మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఆయన విడుదలచేసిన సర్క్యులర్‌ను, క్రిశాంక్ విడుదల చేసిన సర్క్యులర్‌ను నిపుణుల ముందు పెడదామని, తాము ఫోర్జరీ చేసినట్టు నిరూపిస్తే తాను జైలుకు వెళ్లడానికి సిద్ధమని, రేవంత్ తప్పు చేసినట్టు తేలితే ఆయన జైలు వెళ్లడానికి సిద్ధమా? అని సవాల్ విసిరారు. క్రిశాంక్‌పై ఓ పనికిమాలిన కేసు పెట్టి వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉస్మానియా మెస్‌ల మూసివేత వ్యవహారాన్ని బయటపెట్టిన క్రిశాంక్‌ను వారం రోజులుగా జైలులో పెట్టారని, ఫోర్జరీ చేసినవారు మాత్రం బయట తిరుగుతున్నారని మండిపడ్డారు. తప్పుచేసిన రేవంత్ జైలులో ఉండాల్సింది పోయి బయట తిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ సిగ్గు తెచ్చుకుని చేసిన తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు. వెంటనే క్షమాపణ చెప్పి ఏ తప్పు చేయని క్రిశాంక్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమకు పోరాటాలు కొత్తకాదని, క్రిశాంక్ జైలులో ధైర్యంగా ఉన్నారని తెలిపారు. క్రిశాంక్ భార్య సుహాసిని కూడా ధైర్యంగా ఉన్నారని పేర్కొన్నారు. క్రిశాంక్‌ను పరామర్శించేందుకు కేటీఆర్ వస్తున్న విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జైలు వద్దకు తరలివచ్చారు.

**తప్పుడు కేసు బనాయించారు: సుహాసిని**

క్రిశాంక్‌పై ఉద్దేశపూర్వకంగా అక్రమ కేసు బనాయించి జైలుకు పంపారని క్రిశాంక్ భార్య సుహాసిని ఆరోపించారు. తప్పుడు కేసుపై ఇన్ని రోజులుగా జైలులో ఉంచుతున్నారంటేనే అనుమానాలు వ్యక్తమవుతున్నారని పేర్కొన్నారు. కష్టాల్లో ఉన్నవారు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే ఇబ్బందులు పోతాయనే నమ్మకం ప్రజల్లో రావాలని తెలిపారు. న్యాయమూర్తులు జ్యోకం చేసుకొని ఇటువంటి కేసుల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

**క్రిశాంక్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు నేటికి వాయిదా**

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ బెయిల్ పిటిషన్‌పై తీర్పు గురువారానికి వాయిదా పడింది. 4వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి తల్లి మరణంతో సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి కోర్టు 7వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట ఇరుపక్షాల వాదనలు పూర్తయ్యాయి. బుధవారానికి తీర్పును కోర్టు రిజర్వు చేసింది. సదరు మేజిస్ట్రేట్ సైతం బుధవారం సెలవులో ఉండడంతో కేసును 21వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు బదిలీ చేశారు. క్రిశాంక్ బెయిల్ పిటిషన్‌పై ఆయన న్యాయవాదులు తీర్పు కోరగా గురువారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వాదనలు పూర్తయినా తీర్పు ప్రకటించకపోవడంపై న్యాయవాదులు ఆందోళన వ్యక్తంచేస్తూ నాంపల్లి కోర్టుల ఇన్‌చార్జి, జిల్లా జడ్జికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. గురువారం కూడా తీర్పు రాకుంటే ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

# లోకాయుక్తకు ఆ అధికారం లేదు

**నిర్మాణం కూల్చివేత ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): ప్రైవేటు నిర్మాణాలను తొలగించాలంటూ లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. సివిల్ వివాదాలపై విచారించి ఉత్తర్వులు జారీచేసే అధికారం లోకాయుక్తకు లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ ఆదేశాలను జారీ చేసింది. హైదరాబాద్‌లోని చాంద్రాయణగుట్టలో చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని 2015లో లోకాయుక్త జారీ చేసిన ఉత్తర్వులను సీహెచ్ హనుమంతరావు హైకోర్టులో సవాల్ చేశారు. పిటిషనర్‌కు చెందిన 194 చదరపు గజాల స్థలంలోని 33.33 గజాలను రోడ్డు విస్తరణ పేరుతో జీహెచ్‌ఎంసీ తీసుకుని పరిహారం కూడా చెల్లిందని న్యాయవాది చెప్పారు. మిగిలిన స్థలంలో పిటిషనర్ ఇంటి నిర్మాణం చేస్తుంటే అంజమ్మ అనే మహిళ ఫిర్యాదు చేస్తే.. తన పరిధిలోకి రాని అంశంపై లోకాయుక్త విచారించి నిర్మాణాన్ని తొలగించాలని జీహెచ్‌ఎంసీకి ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, సివిల్ వివాదాలపై లోకాయక్త విచారణ చేసే పరిధి లేదని చెప్పింది. లోకాయుక్త ఉత్తర్వులను రద్దు చేసింది.

# కఠిన చర్యలు తీసుకోవద్దు

**ఢిల్లీ పోలీసులకు ఆదేశాలివ్వండి**
**హైకోర్టులో టీపీసీసీ పిటిషన్**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రి అమిత్‌షా వీడియో మార్ఫింగ్ అంశంపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన కేసులో తమ పార్టీకి చెందినవారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ టీపీసీసీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్ గురువారం హైకోర్టు విచారణ చేసే అవకాశం ఉన్నది. ఇందులో రాష్ట్ర హోంశాఖ, డీజీపీ, సిటీ పోలీస్ కమిషనర్, ఢిల్లీ ఎస్పీ, ప్రభుత్వ ఉద్యోగులు మీరాజ్, శింకు శరణ్‌సింగ్‌లను ప్రతివాదులుగా చేర్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారంటూ వీడియోను సోషల్ మీడియాలో వచ్చేలా చేశారంటూ ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగి శింకుశరణ్‌సింగ్ ఫిర్యాదు ఆధారంగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు పేరుతో ఢిల్లీ నుంచి వచ్చామని సుమారు 150 మంది పోలీసులు టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శులను, వారి కుటుంబసభ్యులను భయాందోళనలకు గురిచేస్తున్నారని పేర్కొంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిటిషన్ వేశారు. టీపీసీసీ సోషల్ మీడియా విభాగం సెక్రటరీల వ్యక్తిగత స్వేచ్ఛను హరించే ప్రయత్నం జరుగుతున్నదని ఆరోపించారు.

# ఆలయ భూములు కబ్జా కానివ్వొద్దు

**దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు. ఎండోమెంట్ కమిషనర్ కార్యాలయంలో శాఖ ఉన్నతాధికారులతో బుధవారం ఆమె ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేవాదాయశాఖ ఆధీనంలోని భూముల వివరాలను సేకరించాలని, అన్యాక్రాంతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని, కబ్జాలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. వేసవి తీవ్రత దృష్ట్యా దేవాలయాల్లో భక్తులకు మౌలిక సదుపాయాలు, గ్రీన్ మ్యాట్స్, కార్పెట్స్, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఎండోమెంట్ కమిషనర్, సమాచార పౌర సంబంధాలశాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావుతోపాటు పలువురు అడిషనల్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ప్రధాన దేవాలయాల కార్యనిర్వాహక అధికారులు పాల్గొన్నారు.

# రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానన్లేదు

- **నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం**
- **వానొచ్చినా హైదరాబాద్‌లో కరెంటు పోలేదు**
- **ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటూ గెలవదు**
- **మీట్ ది ప్రెస్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రైతుబంధు అడిగితే చెప్పుతో కొడతానని తాను అనలేదని రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ఆ మాట తాను అన్నట్టుగా నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమేనని చెప్పారు. బీఆర్‌ఎస్, బీజేపీ పార్టీలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి రైతుబంధును నిలుపుదల చేయించాయని ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మీట్ ది ప్రెస్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు కూడా గెలవదని తేల్చి చెప్పారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏపీలో కనీసం గ్రామ సభ్యుడు కూడా లేని స్థితికి చేరుకున్నదని పేర్కొన్నారు.

**ఎమ్మెల్సీ కవితపై వివాదాస్పద వ్యాఖ్యలు**

బతుకమ్మ పూలలో మందు బాటిల్ ఉంటదని మహిళలకు తెలియదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎమ్మెల్సీ కవితపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బతుకమ్మ.. బతుకమ్మ అంటూ మందు అమ్మిందని నోరుపారేసుకున్నారు. గత ప్రభుత్వం బీఆర్‌ఎస్‌కు కోకాపేటలో కేటాయించిన 11 ఎకరాలను వెనక్కి తీసుకుంటామని తెలిపారు.

## భారీ వర్షం కురిసినా హైదరాబాద్‌లో కరెంటు పోలేదు

హైదరాబాద్‌లో మంగళవారం గాలి దుమారంతో భారీ వర్షం కురిసినా కరెంటు పోలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. వెంటనే అధికారులతో మాట్లాడి కరెంటు సమస్య లేకుండా చూశామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా కరెంటు పోవడం లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్తు సమస్య ఏర్పడినట్టు బీఆర్‌ఎస్ దుష్ప్రచారం చేస్తున్నదని విమర్శించారు.

# చీకట్లో చందానగర్

- **విరిగిన చెట్ల తొలగింపులో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం**
- **24 గంటల పాటు కరెంటు కోతలు**
- **తీవ్ర ఇబ్బందుల్లో ప్రజలు..**
- **సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన**


కరెంట్ ఎందుకిస్తాలేరంటూ అధికారులను ప్రశ్నిస్తున్న చందానగర్ వాసి

కొండాపూర్, మే 8 : రాష్ట్రంలో నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు. ప్రజలకు కరెంట్ కష్టాలు ఉండకూడదని, కరెంట్ కట్ చేస్తే విద్యుత్తు ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా అధికారుల్లో చలనం లేకుండా పోయింది. మహానగరంలో భారీ వర్షాలు పడినా నాణ్యమైన కరెంట్ సరఫరా చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ప్రకటించారు. మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షాలకు చందానగర్‌లో అంధకారం అలుముకున్నది. చందానగర్‌లోని తారానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలపై భారీగా చెట్లు విరిగి పడటంతో పాటు 11కేవీ విద్యుత్ పోల్స్ పడిపోయాయి. దీంతో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు కరెంట్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. 24 గంటలుగా కరెంట్ సరఫరా లేకపోవడంతో మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానాలు చెప్పారు. మరికొంతమంది అసలు స్పందించలేదు. దీంతో సహనం కోల్పోయి ఆగ్రహానికి లోనైన చందానగర్‌వాసులు సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. సీపీఎం నాయకుడు క్రిష్ణ కరెంట్ కోతలపై అధికారులను ప్రశ్నించగా సిబ్బంది కొరత ఉందని చెప్పి తప్పించుకున్నారు. ఆర్టిజన్లు, లైన్‌మెన్ల కొరత తీవ్రంగా ఉందని దీనిపై విద్యుత్ శాఖ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. చందానగర్ కాంగ్రెస్ నాయకుడు శేఖర్‌రెడ్డి విద్యుత్తు శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిందిగా కోరారు.

**ఫిర్యాదులకు స్పందన లేదు**

చందానగర్ చెన్నారెడ్డి దవాఖాన సమీపంలోని కాలనీల్లో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం సాయంత్రం వరకు కేవలం రెండు గంటలే కరెంట్ ఇచ్చారు. ఇచ్చిన 10 నిమిషాలకు మళ్లీ పోయింది. వచ్చిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మళ్లీ అంధకారం నెలకొంది. అధికారులు జాగ్రత్తలు తీసుకుంటే సమస్యలు తలెత్తేవి కావు. ఫిర్యాదులకు స్పందన కరువైంది.

**- వెంకటేశ్వరరావు, చందానగర్**

# వానకాలం రైతుబంధు లేనట్టే?!

మొదటిపేజీ తరువాయి...

కింద రూ.15 వేలు ఇస్తుందా? అనేది తేలాల్సి ఉన్నది. వానకాలంలో అందరికీ ఇస్తుందా? కొందరికే పరిమితం చేస్తుందా? ఎన్ని ఎకరాలు దాటినవారికి ఎగనామం పెడుతుంది? అనే అంశంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉన్నది. రైతుభరోసా నిబంధనల్లో మార్పులు, నిధులు సమకూర్చడం వంటి అంశాలు పెట్టుబడి సాయం పంపిణీపై ప్రభావం చూపనున్నాయి. దీంతో వానకాలం సీజన్‌కు పెట్టుబడి సాయం అందించడంలో జాప్యం జరిగే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాఖ వర్గాలు సంకేతాలిస్తున్నాయి. వానకాలం పెట్టుబడి సాయాన్ని కూడా యాసంగి సీజన్‌లో మాదిరిగానే పంట వేసే సమయంలో కాకుండా పంట కోతలు పూర్తయ్యాక జమ చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్తున్నాయి.

**మార్పులు చేసేదెప్పుడు? ఇచ్చేదెప్పుడు?**

కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు కింద ఏడాదికి ఎకరాకు రూ.పది వేలు అందజేయగా, కాంగ్రెస్ మాత్రం రైతుభరోసా పేరిట ఎకరాకు రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చింది. ప్రస్తుత యాసంగి సీజన్‌కు మాత్రం గతంలో మాదిరిగా రైతుబంధు కింద ఎకరాకు రూ.5 వేలు అందజేసింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలంటే, వానకాలం సీజన్ నుంచి రైతుభరోసా పేరిట ఏడాదికి ఎకరాకు రూ.15 వేల చొప్పున అందరికీ పెట్టుబడి సాయం అందజేయాల్సి ఉంటుంది. అంటే కారుకు రూ.7,500. అయితే, పంట సాగు చేసే భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు వ్యవసాయ మంత్రి తుమ్మల, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ విషయాన్ని స్పష్టంగానే చెప్పున్నారు. రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చ పెడతామని, ఆ తర్వాతే అమలుచేస్తామని పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో చర్చించేదెప్పుడు? నిబంధనల్లో మార్పులు చేసేదెప్పుడు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. జూన్‌లో తొలకరి చినుకులు పలకరించగానే రైతులు వ్యవసాయ పనులు మొదలుపెడతారు. జూలై, ఆగస్టు మాసాల్లో విత్తనాలు చల్లడం, నాట్లు వేయడం లాంటి పనులు ముమ్మరంగా సాగుతుంటాయి. ఆలోగా పెట్టుబడి సాయం అందజేస్తేనే అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన దుస్థితి రైతులకు తప్పుతుంది. అందుకే కేసీఆర్ ప్రభుత్వం ఇతర చెల్లింపులు ఆపి అయినా సరే, రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందజేసింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అంత కమిట్‌మెంట్ చూపిస్తుందా? అన్న సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

**బడ్జెట్ ఇబ్బందులు... నిధుల కటకట**

రైతుల సంక్షేమం పట్ల ప్రభుత్వానికి ఎంతో చిత్తశుద్ధి, నిబద్ధత ఉంటే తప్ప రైతుబంధు లేదా రైతుభరోసా పథకాలకు సకాలంలో నిధులు సమకూర్చడం సాధ్యం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు అందరికీ రైతుభరోసాను అమలు చేయాలంటే యాసంగి లెక్కల ప్రకారం 1.53 కోట్ల ఎకరాలకుగాను రూ.11,475 కోట్లు సమకూర్చాల్సి ఉంటుంది. ఈ లెక్కన యాసంగిలో ఇచ్చిన దానికంటే అదనంగా రూ.4,095 కోట్లు సిద్ధం చేయాలి. యాసంగి సీజన్‌లో ఐదారు నెలలు సమయం తీసుకొని కూడా రూ.7,625 కోట్లు ఇవ్వడానికే కిందా మీదా పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం.. రాబోయే రెండు మూడు నెలల్లో రూ.11,475 కోట్లు సర్దుబాటు చేయగలదా? అన్నది ప్రశ్న. దీనికితోడు రైతుభరోసాకు నిధులు ఇవ్వాలంటే బడ్జెట్‌లో కేటాయింపులు చేసి, అసెంబ్లీలో ఆమోదం పొందాల్సి ఉంటుందని చెప్తున్నారు. ఈ ప్రక్రియ జూన్‌లో పూర్తయ్యే అవకాశం లేదు.

**సాగుకు ముందు సాయం కష్టమే**

గత ప్రభుత్వం రాళ్లు, రప్పలకు కూడా రైతుబంధు ఇచ్చిందని, తమ ప్రభుత్వం పంట సాగు చేసే భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందిస్తుందని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. ఇది అమలు కావాలంటే, ఏ రైతు ఎన్ని ఎకరాల్లో పంటలు సాగు చేశారో లెక్కించి, ఆ తర్వాత పెట్టుబడి సాయం అందించాల్సి ఉంటుంది. ఈ విధంగా క్షేత్ర స్థాయిలో లెక్కలు వేసే ప్రహసనం ముగిశాకే పెట్టుబడి సాయం అందిస్తామంటే, ఇకపై సీజన్ ఆరంభంలోనే రైతులకు పెట్టుబడి సాయం అందడం కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జరిగితే రైతుబంధు ముఖ్య ఉద్దేశమే దెబ్బతినే ప్రమాదం ఉన్నది. రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందజేయడం, ప్రైవేట్ వడ్డీల ఊబిలో చిక్కుకోకుండా రైతులను కాపాడుకోవడం, వ్యవసాయ ఉత్పత్తుల ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచడం రైతుబంధు పథకంలోని ముఖ్య ఉద్దేశాలు. ఇలాంటి సమోన్నత లక్ష్యాలేవీ లేని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు మూల సిద్ధాంతాన్నే దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**పంటల సర్వే ఎలా సాధ్యం?**

పంటల సర్వే నిర్వహించి పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. అయితే 100% కచ్చితంగా పంటల సర్వే చేయడం సాధ్యమేనా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోసారి పంటల సాగు మొదలుపెడతారు. ఒక్కో రకమైన పంటను ఒక్కోసారి సాగు చేస్తారు. వానకాలం పంటల సాగు జూన్‌లో మొదలైతే సెప్టెంబర్ వరకు కొనసాగుతూనే ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో పంటల సర్వే ఎప్పు డు పూర్తి చేస్తారనేది ప్రశ్న. సెప్టెంబర్ వరకు పంటల సర్వేనే పూర్తికాకపోతే ఇక రైతులకు సాయం ఎప్పుడు అందిస్తారనేది మరో ప్రశ్న. ఇదే జరిగితే పంటల కోత పూర్తయిన తర్వాతే రైతులకు పెట్టుబడి సాయం అందుతుంది.